
ప్రజాశక్తి
శనివారం 7 జనవరి 2023
5
విజయనగరం



లోకాయుక్త అంశాలపై నివేదికలు రూపొందించండి

డిఆర్‌ఒ ఎం. గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని వివిధ శాఖల్లో తలెత్తిన సమస్యలపై నమోదైన లోకాయుక్త కేసులకు సంబంధించి నిర్ణీత కాలంలో పూర్తి వివరాలతో కూడిన నివేదికలు తయారు చేసుకోవాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు సూచించారు. జిల్లాలో నమోదైన లోకాయుక్త కేసుల తాజా పరిస్థితిపై వివిధ విభాగాల అధికారులతో ఆయన గురువారం తన ఛాంబర్లో సమావేశమయ్యారు. కేసుల పూర్వాపరాలు, తాజా స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇరు వర్గాలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన జాబితాలను తయారు చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా విభాగాల పరిధిలో నమోదైన కేసులపై సంబంధిత విభాగాధిపతులపై సంప్రదించి పూర్తి వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఎఒ శ్రీకాంత్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అదే పంథా.. మిల్లర్ల దందా

జామి గ్రామానికి చెందిన వర్రి గోపి గత నెల 14న గంట్యాడ మండలం రావివలస కనకదుర్గ రైస్ మిల్లుకు 98 క్వింటాలు (40కేజీ) ధాన్యం ట్రక్ షీట్ తో పాటు తీసుకెళ్లాడు. కానీ మిల్లర్లు అదనపు కేజీలు డిమాండ్ చేసి, అందుకు గాను రూ.2,590 డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ధాన్యం దించబోమని చెప్పారు. చివరికి గోపి మిల్లరు అడిగినా మొత్తాన్ని చెల్లించి, ధాన్యం దింపుకున్నాడు.

గంట్యాడ మండలం తానవరం గ్రామానికి చెందిన మరో రైతు సిరికి వెంకట అప్పల నాగేశ్వరరావు శ్రీ రాధాకృష్ణ మిల్లుకు 87 బస్తాలు (40కేజీలు) తీసుకెళ్లగా, ఆయన నుంచి రూ.7వేలు వసూలు చేశారు. గత్యంతరం లేక చేతిలో ఉన్న రూ.2,200 క్యాష్ ఇచ్చి, ఫోన్ పే ద్వారా 4,800 చెల్లించవలసి వచ్చింది.

జామి గ్రామానికి చెందిన మరో రైతు బండారు నారాయణ గంట్యాడ లోని శ్రీ శ్రీనివాస రైస్ మీల్లుకు 72 బస్తాలు తీసుకెళ్లగా, ఆయన నుంచి రూ.7,700 వసూలు చేశారు. ఇలా ఒక్క గంట్యాడ మిల్లులే కాదు, జిల్లాలో అన్ని రైస్ మిల్లర్లు ఇదే దందా. జిల్లా వ్యాప్తంగా రైతులు ధాన్యం అమ్ముకోవడానికి అదనపు డబ్బు చెల్లిస్తున్న పరిస్థితి. వీరే కాదు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతుల నుంచి దోపిడీ కొనసాగుతుంది.

- అప్పుడు ధాన్యం... ఇప్పుడు డబ్బు
- అదనపు కేజీల పేరుతో యథేచ్ఛగా దోపిడీ
- గత్యంతరం లేక చెల్లించుకుంటున్న రైతులు
- వసూళ్లపై విజిలెన్స్ విచారణకు ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- జామి

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో క్వింటాకు అదనంగా ధాన్యం డిమాండ్ చేయగా, ఈ సారి అదనపు ధాన్యానికి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారం బాహాటంగా సాగుతున్నా... అధికారులకు మాత్రం పట్టడం లేదు. ఇందుకు కారణం లేకపోలేదు. అడ్డగోలుగా రైతుల నుంచి మిల్లర్లు అక్రమ వసూలు చేస్తున్నా...అధికార పార్టీ నాయకులు మిల్లర్ల అసోసియేషన్ కు అండగా ఉన్నారట. అందుకే అదనపు కేజీల దందా జిల్లాలో మూడుపువ్వులు ఆరుకాయల్లా సాగిపోతోంది. ఈనేపథ్యంలనే కలెక్టర్ నుంచి మండల తహశీల్దార్ వరకు ఎవరూ నోరు మెదపడం లేదట. చివరికి అధికారులకు రైతు సంఘం రాతపూర్వక ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. పైగా జిల్లాలో మిల్లర్లకు గతంలో 1:1 (కోటి బ్యాంకు గ్యారంటీకి కోటి విలువ చేసే ధాన్యం ఇవ్వగా) నేడు 1:4 అవకాశాన్ని కల్పించారు. దీంతో జిల్లాలో మిల్లర్ల యథేచ్ఛగా రైతులను దోచుకుంటున్నారు. జిల్లా ఇదే పరిస్థితి నెలకొంది.

ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో సమూల మార్పులు చేశామని చెబుతున్న ప్రభుత్వం మిల్లర్లకు మాత్రం సర్వం దోచిపెట్టేలా చర్యలు తీసుకుందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మిల్లర్ల ఆగడాలు అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్లు కు సంబంధం లేకుండా ఈ సారి ధాన్యం కొనుగోలు జరుగుతోందని చెబుతూ... ఒక్క ధాన్యపు గింజ కూడా రైతులు మిల్లర్లకు అదనంగా ఇవ్వాల్సిన పని లేదని ప్రచారం చేస్తూ...చివరికి రైతును నిలువునా మోసం చేస్తుంది. జిల్లాలో ఈ ఏడాది 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండించారు. సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 10వేలు టన్నులు కూడా కొనుగోలు చేయలేదని, కానీ నేటికీ 1,70లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి గతం కన్నా, మిల్లర్లు దందా పెరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రు.కోటి బ్యాంకు గ్యారంటీ తో రూ.కోటి విలువ చేసే, ధాన్యం కొనుగోలుకు అవకాశం కల్పించగా, నేడు అదే గ్యారంటీతో రూ.4కోట్లు ధాన్యం కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించడం విశేషం. ఈ నేపథ్యంలోనే మిల్లర్లు దందా పెచ్చు మీరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదనపు కిలోలకు డబ్బు చెల్లించాల్సిందే



ఆర్‌బికెల్లో ట్రక్‌షీటు రాయించుకొని ధాన్యం పట్టుకుని మిల్లులకు వెళితే, అదనపు ధాన్యం కావాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. చెల్లిస్తేనే ధాన్యం దించుకుంటున్నారు. లేదంటే నాణ్యత పేరుతో నానా యాగి చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు కూడా అదనపు ధాన్యం చెల్లించడానికి సిద్ధమైపోతున్నారు. ఇలా అన్ని మిల్లుల్లో దందా కొనసాగుతోంది.

- చలుమూరి వెంకటరావు, జామి

దందాపై విజిలెన్స్ విచారణ చేయాలి



ఆర్‌బికెలు ధాన్యం సేకరించి ట్రక్ షీట్ తీస్తున్నా, అదనపు కేజీలకు డబ్బు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. జిల్లాలో వేలాది రైతుల నుంచి అక్రమ వసూలు చేస్తున్నారు. కొన్నింటిపై ఫిర్యాదులు కూడా చేశాం. అయితే విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేసి, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి. రైతులు చెల్లించిన డబ్బు తిరిగి ఇప్పించాలి. అప్పుడే ప్రభుత్వం చెబుతున్న పారదర్శకత పాలన మాటలను ప్రజలు విశ్వసిస్తారు. లేదంటే రైతులంతా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు.

- బుద్దరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

చిట్టిగురువులు.. దేశంలోనే ప్రత్యేకం

మనస్ఫూర్తిగా చేస్తే మంచి ఫలితాలు ● చిట్టి గురువులు విజయోత్సవ కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం



చిట్టిగురువుకు ప్రశంసాపత్రం అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చడానికి పిల్లలే పెద్దలకు పాఠాలు చెప్పే చిట్టి గురువులు కార్యక్రమం దేశం లోనే ప్రత్యేకతను సంతరించుకుందని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. ఏడాది క్రితం ప్రారంభించి పరీక్షలు నిర్వహించుకొని కొత్తగా 87 వేల మంది అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన సందర్భంగా చిట్టిగురువులు విజయోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియం లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, శాసన మండలి సభ్యులు సురేష్ బాబు, పాకలపాటి రఘు వర్మ, ఇందుకూరి రఘురాజు, శాసన సభ్యులు కంబాల జోగులు, వయోజన విద్య శాఖ సంచాలకులు సూర్యనారాయణ, డిడి కోట్ల సుగుణాకర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిట్టి గురువులు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజా ప్రతినిధులకు మండల బృందాలకు, ప్రత్యేకాధికారులకు , సర్పంచ్ లకు చిట్టి గురువులకు ఘనంగా సన్మానించి మేమెంటోలను , సర్టిఫికేట్లను అందజేశారు. అంతకు ముందు కోలగట్ల మాట్లాడుతూ చదువు ప్రాధాన్యతను గుర్తించి చదువులేని వయోజనులకు చిట్టి గురువులతో చదువు చెప్పించడం గొప్ప ఆలోచన అని కొనియాడారు. చదువు తోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గుర్తించి విద్య కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ సూర్య కుమారి మాట్లాడుతూ మనస్ఫూర్తిగా పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అనడానికి ఇదే ఒక ఉదాహరణ అని అన్నారు. జిల్లా అక్షరాస్యత ప్రస్తుతం 94 శాతానికి చేరిందని, ఇది ఇక్కడితో ఆగిపోకూడదని, ఈ కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. గుర్ల, నెల్లిమర్ల మండలాలు శత శాతం సాధించాయని, మిగిలిన మండలాలు కూడా ఆ దిశగా నడవాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టినపుడు అనేక సందేహాలు ఉండేవని, కానీ 94 శాతం అక్షరాస్యతను సాధించి అంచనాలను తిరగ రాసిందని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నుండి విద్యా కార్యక్రమాలకు నిధుల సహకారం అందిస్తామని అన్నారు. 27 మండలాల్లో సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని కలెక్టర్ కు సూచించారు. ఈ సందర్భంగా చదువు గొప్పతనం, ప్రాధాన్యతను తెలిపేలా ఆలపించిన గీతాలు, చిన్నారులు చేసిన నృత్యాలు ఆలోచింపజేసాయి. అన్ని మండలాలకు చెందిన చిట్టి గురువులను సన్మానించారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు గణేష్, ఇంద్రావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి రోడ్ రేస్ సైక్లింగ్ పోటీలు మహారాష్ట్ర రాష్ట్రం షిరిడీలో జరుగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాకు చెందిన డి. గణేష్ ఎన్. ఇంద్రావతి ఎంపికై జాతీయ పోటీలకు శుక్రవారం పయనమయ్యారు. వీరిని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం ఎస్ ఎన్ రాజు, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు.

తైక్వాండో పోటీలకు భార్గవి ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈనెల 9 నుంచి 12 వరకు అమృత్‌సర్‌లో జరగనున్న యూనివర్సిటీ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రాజా కళాశాలకు చెందిన క్రీడాకారిణి వై. భార్గవి ఎంపికైంది. ఈ సందర్భంగా భార్గవిని యువ రాజా బేబినాయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచాలని బేబినాయన కోరారు. కోచ్ బంకురు ప్రసాద్ ను అభినందించారు.

దళారుల నుంచి రైతులను కాపాడండి

అధికారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం



మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. రైతు నుంచి కొనుగోలు చేసిన దగ్గర నుంచి మిల్లులకు ధాన్యం చేరే వరకు పూర్తి పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో చిన్న సమస్య కూడా ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దళారుల బెడద లేకుండా రైతులకు అన్ని రకాల సేవలు అందించాలని పేర్కొన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రక్రియ సజావుగా సాగేలా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యం మొత్తం కేవలం ప్రైవేట్ మిల్లుల వద్దే కాకుండా ఎఫ్.సి.ఐ. గోదాములకు కూడా తరలించాలని అధికారులను ఆదేశించారు. కాలయాపన జరగకుండా వెనువెంటనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ ప్రక్రియలో జరిగే ప్రతి దశపై రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని సూచించారు. బిల్లుల చెల్లింపులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపు గురించి, ఇతర ప్రక్రియల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వివరించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ డిఎం మీనా కుమారి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 2020, 21, 22 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను శుక్రవారం జిల్లా పరిషత్తు ఆడిట్ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలో జెడ్‌పి ప్లానింగ్ విభాగం సిఇఒ కె.తులసీనాథ్, సీనియర్ సహాయకులు పిఎం రవికుమార్, పివి రమణమూర్తి పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్ 1 పరీక్ష

5,530 మంది అభ్యర్థులు.. 13 పరీక్షా కేంద్రాలు ● అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ ఎం.గణపతిరావు

ఈనెల 8న ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ 1 పరీక్ష నిర్వహణకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. లైజనింగ్ అధికారులు, సెంటర్ ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఎపిపిఎస్‌సి ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అందుకోసమే జిల్లా అధికారులను లైజనింగ్ అధికారులుగా ప్రభుత్వం నియమించిందని అన్నారు. ఈ పరీక్ష కోసం జిల్లా కేంద్రంలోనే 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 5,530 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తోపాటుగా, ప్రభుత్వం ఆమోదించిన ఏదోఒక గుర్తింపు కార్డును తీసుకు రావాలని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైనవారు 830900534, 8333813468 ఫోన్ చేయవచ్చని సూచించారు.

పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డిఆర్‌ఓ తెలిపారు. ప్రతీ అభ్యర్ధి ఆ రోజు ఉదయం 10 గంటలు నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు జరిగే రెండు పేపర్లను రాయాల్సి ఉంటుందని చెప్పారు. గంట ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం పరీక్షకు 9.45 గంటలు తరువాత, మధ్యాహ్నం 1.45 గంటలు తరువాత, పరీక్షా కేంద్రం లోపలికి అభ్యర్థులకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు లోపలికి అనుమతి లేదని తెలిపారు. ఇన్విజిలేటర్లు కూడా తమ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకువెళ్లకూడదని స్పష్టం చేశారు. కోవిడ్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులకు థర్మల్ బాడీ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. తాగునీరు, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించాలని, చుట్టుప్రక్కల జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్ష ముగిసేవరకు అభ్యర్థులను బయటకు పంపించకూడదని స్పష్టం చేశారు.

అంధులు, చేతితో రాయలేని విభిన్న ప్రతిభావంతుల కోసం, అవసరమైన వారికి స్క్రైబ్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్క్రైబ్‌ల విద్యార్హత ఇంటర్ వరకు ఉండొచ్చని, వారి విద్యార్హతలను పరిశీలించాలని సూచించారు. వికలాంగత్వ శాతాన్ని పరిశీలించిన తరువాతే స్క్రైబ్‌లను అనుమతించాలని స్పష్టం చేశారు. ఆర్‌టిసి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిఆర్‌ఒ ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటిండెంట్ పివి మహేష్, ఎపిపిఎస్‌సి సహాయ కార్యదర్శి వి.బాబూరావు, ప్రతినిధులు ఆర్‌వి రమణ, యోగి, వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూర్బన్ మిషన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ రూర్బన్ మిషన్ కింద గరివిడి మండలంలో మంజూరైన పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. రూ.18 కోట్ల విలువైన పనులు తక్షణమే ప్రారంభించి ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. రూర్బన్ మిషన్ పనులపై శుక్రవారం జిల్లా పరిషత్తులోని తన ఛాంబరులో జెడ్‌పి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, గరివిడి మండల స్థానిక ప్రతినిధులతో సమీక్షించారు. చేపట్టిన పనులు పూర్తయిన వెంటనే వాటికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, గరివిడి ఎంపిపి మీసాల విశ్వేశ్వరరావు, ఎంపిడిఒ జి.భాస్కరరావు, పంచాయతీరాజ్ డిఇ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ గోవింద్, జెడ్‌పి ఇంజినీరింగ్ కో-ఆర్డినేటర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియును సందర్శించిన విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివిని శుక్రవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జెఎన్‌టియుజివి డైరీ, కేలండర్లను విడుదల చేశారు. యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరంలో యూనివర్సిటీ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేందుకు అందరూ కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెఎన్‌టియుజివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు పన్ను

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఖాళీ స్థలాలకు పన్ను విధింపుకై ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు వెల్లడించారు. శుక్రవారం సమావేశ మందిరంలో వార్డు కార్యదర్శులు, ఆర్.ఐ.లతో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు ఖాళీ స్థలాల పన్ను విధింపు ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఎటువంటి మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి ఖాళీ స్థలాలపై పన్నుల విధింపు చేపట్టిన 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాలను అందించనున్నామని చెప్పారు. ఇందుకోసం కార్యాలయం మొదటి అంతస్తులు నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాల పన్ను విధింపుకై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు జిరాక్స్ కాపీలు, ఇసి, ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువీకరణ, 250 రూపాయల చలానా (నగరపాలక సంస్థ కార్యాలయంలోనే పొందవచ్చును) అందజేయాలని చెప్పారు. పత్రాలు సమర్పించిన 72 గంటలలో ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తామని తెలిపారు. ఇది నగర ప్రజలు తమ ఖాళీ స్థలాలకు పన్నులు విధింపు ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు చక్కటి సదవకాశంగా భావించాలని అన్నారు. జగనన్న లేఔట్లలో ఇళ్ళ నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయించాలని కార్యదర్శులకు ఆయన ఆదేశించారు. నగరంలో నీటిపన్ను వసూళ్ళను ముమ్మరం చేయాలన్నారు. నీటి పన్నులు చెల్లించని ఎడల కుళాయి కనెక్షన్లు తొలగించాలని చెప్పారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, హౌసింగ్ డిఇ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కల్యాణ మస్తు

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ కల్యాణ్‌చక్రవర్తి

ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న కల్యాణ మస్తు పథకం అర్హులందరికీ అందాలని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కాసిందొరవలస, పెంట, అలజంగి సచివాలయాల్లో జగనన్న కల్యాణ మస్తు దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పేదరికంలో ఉన్న ఆడపిల్లలపెళ్లి కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని తసుకువచ్చిందన్నారు. అమ్మాయి వయస్సు18 సంవత్సరాలు నిండి ఉండాలని, వార్షికాదాయం రూ. 2 లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. కొత్తగా పెళ్లయిన వారు, జనన ధ్రువీకరణ పత్రం, పదోతరగతి ఉత్తీర్ణత, కుల ధ్రువీకరణ, వివాహ ఆహ్వాన పత్రిక తదితర ఆన్నీ పత్రాలు పూర్తి గా పరిశీలించిన మిదటే పథకానికి అర్హులు అవుతారన్నారు.

నగరంలో కోలగట్ల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఒకటవ డివిజన్ సిద్ధి వినాయక నగర్ లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాలకు పథకాలు అందే విధంగా ఎన్నికల హామీలను నెరవేర్చుతూ ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, వైసిపి నాయకులు వజ్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-విజయనగరం



అంగన్వాడీలతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. శుక్రవారం ఉదయం కొత్త ధర్మపురిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికహారం కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర స్థాయిలో అంగన్వాడీ కేంద్రాల్లో పర్యటించిన నేపథ్యంలో పలు సమస్యలు కమిషన్ దృష్టికి వచ్చాయని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించాలని, బాలలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. సచివాలయంలో సంబంధిత ఉద్యోగులు తరుచుగా కేంద్రాన్ని సందర్శించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో బాలలకు సంబంధిన సంక్షేమ పథకాలు, బాల్య వివాహాలు, మొదలగు అంశాలకు సంబంధించిన గోడ పత్రికలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్పొరేటర్, మహిళా పోలీస్, అంగన్వాడీ సూపర్ వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాసీల సమ్మెకు ఇఫ్టూ మద్దతు

ప్రజాశక్తి-బొబ్బిలి

వేతన ఒప్పందం చేయాలని కోరుతూ కళాసీలు చేపట్టిన సమ్మెకు ఇఫ్టూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా నాయకులు ఎం.గోపాలం, వి.రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కళాసీల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కళాసీలు చేపడుతున్న సమ్మెకు రైతుకూలీ సంఘం నాయకులు వి.వేణు, పి.లక్ష్మణరావు మద్దతు ప్రకటించారు.

కళాసీల సమ్మెకు వ్యతిరేకంగా షాపుల బంద్

వేతన ఒప్పందం చేయాలని కళాసీలు చేపట్టిన సమ్మెకు వ్యతిరేకంగా పట్టణ కిరాణా వ్యాపారులు షాపులు బంద్ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు కింతలి శ్రీనివాసరావు, వ్యాపారి గ్రంధి ముత్యాలు మాట్లాడుతూ ఇతర ప్రాంతాలు కంటే బొబ్బిలిలో కళాసీలకు అధికంగా వేతనాలు ఇచ్చినప్పటికీ సమ్మె చేయడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు ర్యాలీ చేస్తూ మోర్, రిలియన్స్ షాపులను మూసివేయించారు.

యువత సమస్యలే ఎజెండాగా బహిరంగ సభ

జనసేన నాయకులు గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లాలో జనసేన పార్టీ ఆధర్యంలో 'యువశక్తి ' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని జనసేననాయకులు గురాన అయ్యలు తెలిపారు. శుక్రవారం పలు కళాశాలల విద్యార్థులతో సమావేశమై యువశక్తి సభ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ గళం వినిపించేలా యువశక్తి కార్యక్రమానికి జనసేనాని శ్రీకారం చుట్టారని తెలిపారు . యువత తమ ఆలోచనల గురించి, వారి కష్టాల గురించి, వారి భవిష్యత్ గురించి గళం వినిపించేలా యువశక్తి కార్యక్రమం ఉండనుందని.. అన్నారు. ఈ కార్యక్రమంలో తమ అభిప్రాయాలను యువత వినిపించవచ్చు అని తెలిపారు. దీనికోసం జనసేనపార్టీ ప్రత్యేక ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడి కేటాయించినట్లు తెలిపారు.

ఫోన్ నంబరు 080 69932222, vrwithjspk@ janasenaparty.org సంప్రదించి పేర్ల నమోదు చేసుకోవాలని తెలిపారు. సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదాడ మోహన్ రావు , కాటం అశ్విని, టి.రామకష్ణ (బాలు), రవితేజ, వజ్రపు నవీన్ కుమార్ , పిడుగు సతీష్ , పవన్ కుమార్ ,వంశీ, సాయి,మణి, రవీంద్ర, ఏంటి రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న కార్మికులు

గంట్యాడ : మండలంలోని కొర్లాం గ్రామంలో కాలువలపై అక్రమంగా వేసిన పలకలను శుక్రవారం తొలగించారు. సర్పంచ్ చప్ప వెంకటరమణమ్మ, కార్యదర్శి ధనంజయ ఆధ్వర్యాన కాలువలను మూసివేసిన సిమెంట్ పలకలను తొలగించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో, వీధుల్లో చెత్త వేయొద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలపై ఫిర్యాదు

శృంగవరపుకోట : పట్టణంలోని రేషన్ డిపో నంబర్ 130లో రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సిఎస్ డిటి మూర్తి తెలిపారు. డీలర్ ఆగడాలు ఎక్కువవుతున్నాయని, అనధికార వ్యక్తులతో రేషన్ సరుకులు పంపిణీ చేయించడం వల్ల తక్కువగా ఇస్తున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బియ్యం తక్కువగా ఉన్నాయని అడిగిన లబ్ధిదారులపై డీలర్ బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ప్రశ్నించిన విలేకరిని సైతం చంపేస్తామంటూ బెదిరించడం కొసమెరుపు. అధికార పార్టీ అండతోనే ఆగాడాలంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ఇకెవైసి తప్పనిసరి

దెంకాడ : పిఎం కిసాన్ రైతులంతా ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిలు నాగభూషణం, అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ:గా ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఒ పి.నిర్మల, సర్పంచ్ ఎల్.లక్ష్మణరావు, ఎంపిటిసి వి.అచ్చెన్నాయుడు, పిట్ట అప్పారావు, శ్యామలరావు, బమ్మిడి రమణ, బి.గురుమూర్తి, ఎఇఒ రామకోటి పాల్గొన్నారు.

తమ్మాపురంలో ఎంపిడిఒ పర్యటన

నెల్లిమర్ల : మండలంలోని తమ్మాపురంలో శుక్రవారం ఎంపిడిఒ గిరిబాల పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. సిసి రహదారి పనులు పరిశీలించి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించి ఆరోగ్య పరిస్థితులు పరిశీలించాలని కార్యకర్త జయలక్ష్మికి సూచించారు. రైస్‌మిల్లులో తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు

ప్రజాశక్తి-బొబ్బిలి, రామభద్రపురం

ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన స్థానిక విజేత హైస్కూలు, రామభద్రపురం పూడివీధి ఎంపిపి స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమకర్తగా అనేక విజయాలు సాధించారని తెలిపారు. బొబ్బిలి మండల శాఖ కార్యదర్శి కెజికె నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.బాలరాంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పి ధనంజయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ, ఉపాధ్యక్షులు సిహెచ్ రామారావు, రామభద్రపురంలో మండల కార్యదర్శి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

గంట్యాడ: స్థానిక వైకెపి కార్యాలయంలో శుక్రవారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎనిమాతో బాధపడుతున్న గర్భిణులు, కిశోర బాలికలు, తల్లిదండ్రులకు రక్తహీనత నివారణపై ఎపిఎం శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిలు చినబాబు, గౌరీశ్వరి, అచ్చెన్నాయుడు, ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వంగరలో డ్రైడే

వంగర : మండల కేంద్రం వంగరలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ఎఎన్ఎం విశాలాక్షి ఆధ్వర్యాన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇళ్ల చుట్టూ మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు మరియ, సత్యవతి పాల్గొన్నారు.

బొద్దాంలో నేత్ర వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని బొద్దాం సచివాలయ ఆవరణలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 60 మందికి వైద్యులు ఈశ్వరరావు నేత్ర పరీక్షలు చేసి, 14 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

నెల్లిమర్ల : మండలంలోని సీతారామునిపేట అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్లను శుక్రవారం ఎపి టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పౌష్టికాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంంలో సర్పంచ్ రాంబరికి రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు భారతి, సంతోష్, ఆయా భూలక్ష్మి, మహిళా పోలీస్ పార్వతి పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన సదస్సు


వేపాడ : మండల కేంద్రం వేపాడలో రక్తహీనతపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఎంపిటిసి జి.గంగతల్లి, ఎపిఎం రొంగలి శ్రీనివాసరావు, వేపాడ పిహెచ్‌సి సిహెచ్ఒ ఆంజనేయులు, సత్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి పాల్గొన్నారు.

పిల్లల గ్రామసభలు

వేపాడ : మండలంలోని డబ్బిరాజుపేట, రామస్వామిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం పిల్లల గ్రామసభలను ఏర్పాటుచేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు పాటించాల్సిన దినచర్య గురించి వివరించారు. చదువు పట్ల ఆసక్తి కలిగించేలా సూచనలిచ్చారు.

ఆర్‌యుబి శుభ్రం

కొత్తవలస : కొత్తవలస పారిశుధ్య కార్మికులు శానిటేషన్ మేస్త్రి ఎం.ప్రసాదరావు పర్యవేక్షణలో రైల్వే అండర్ బ్రిడ్జిని శుక్రవారం శుభ్రం చేశారు. ఆర్‌యుబి ఇరువైపులా చెత్తాచెదారంతో నిండి ఉండడంతో శుభ్రం చేశారు. బ్రిడ్జి నిర్మించినప్పటి నుంచి, కొత్తవలస పంచాయతీ సిబ్బందే పర్యవేక్షిస్తున్నారు.


వితరణ చేసిన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

పాఠశాలకు బెంచీలు వితరణ

రామభద్రపురం : మండలంలోని ఆరికతోట గ్రామంలో బిసి కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కిర్ల కృష్ణారావు రూ.80 వేల విలువైన బెంచీలను వితరణ చేశారు. కృష్ణారావు సతీమణి అలివేలు మంగతాయారు జ్ఞాపకార్థం మనుమరాలు క్రిషిత చేతుల మీదుగా శుక్రవారం హెచ్ఎం పూడి లక్ష్మికి అందించారు. అనంతరం కృష్ణారావును హెచ్ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో కృష్ణారావు కుమార్తె లావణ్య, కోడలు దీప్తి, కుటుంబ సభ్యులు కిర్ల అప్పలరాంనాయుడు, కృష్ణమూర్తి, నగేష్‌బాబు, శ్రీనివాస ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

రేగిడి : మండలం వన్నలి గ్రామంలో సర్పంచ్ రమణ శుక్రవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆంధ్రా బ్యాంకులో పనిచేసిన పూర్వపు మేనేజర్ వంతరాం చంద్రమౌళి మనుమడు షేన్సిక్ సాయి వేదాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏటా చంద్రమౌళి పేదలకు వస్త్రదానం చేపడుతున్నట్లు వివరించారు.

8న మెగా రక్తదాన శిబిరం


బొబ్బిలి : అభ్యుదయ పాఠశాలలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చింతా శారద ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు.

పినవేమలిలో క్రీడా పోటీలు

విజయనగరం టౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలని యువజన నాయకుడు, గ్రామ సర్పంచ్ పొట్నూరు వెంకట సాయి సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పినవేమలి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా పిపిఎల్ (పినవేమలి ప్రైమరీ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మొత్తం ఈ టోర్నమెంట్ కు 26 టీములు వివిధ మండలాల నుంచి వచ్చాయని నిర్వాహకులు సురేష్ అప్పారావు తెలిపారు.

36 వేల కుటుంబాలను పలకరించా

ప్రజా సమస్యలు తెలుసుకోవడం సంతృప్తినిచ్చింది ● 'ప్రజాశక్తి'తో శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



ప్రజాశక్తి - జామి, శృంగవరపుకోట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 36 వేలకు పైగా కుటుంబాలను కలిసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు మైలురాయిని దాటిన సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి, మూడున్నర సంవత్సరాల జగన్ పాలన ఎంతో సంతృప్తి కలిగించింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే, కరోనా కారణంగా రెండేళ్లు ప్రజలకు దూరమయ్యాం. దీంతో సిఎం జగన్ ఎంతో ముందుచూపుతో ఆలోచించి, ప్రజలకు నాయకులు చేరువ కావాలని గడపగడపకు.. కార్యక్రమాన్ని రూపొందించారు. నియోజకవర్గంలో మే 11న ఎస్.కోట మండలం కొట్టాంలో తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. అప్పటినుంచి 150 రోజులకు పైగా గ్రామాల్లో ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఈ కాలంలో ఎంతోమంది తమ బాధలు చెప్పుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలతో ఆనందంగా ఉన్నామని చెప్పడం ఎంతో సంతృప్తినిచ్చింది. కొంతమంది అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధిని రప్పించడం నాలో మరువరాని అనుభూతిని అందించింది. ఇటీవల అలమండ గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.10 లక్షలు చెక్ అందించి, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు సహకరించడం ఆనందాన్ని కలిగించే అంశం. ఎస్.కోట మండలంలోని సీతంపేటలో అగ్నిప్రమాదంలో పాలవలస సన్యాసి మృతి చెందిన విషయం తెలుసుకుని ఆ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశాను. ఏళ్లుగా దారపర్తికి రోడ్డు లేక గిరిజనులు నానా అవస్థలు పడుతుంటే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.4.89 కోట్లతో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వీటన్నింటికీ గడపగడపకు కార్యక్రమమే ముఖ్యకారణం.

ప్రస్తుతం వైసిపి ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజల ఇళ్లకు చేరుతున్నాయంటే ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తోంది. ఇలా 150 రోజులపాటు పింఛను రాని వారిని గుర్తించి ఇటీవల నియోజకవర్గంలో వెయ్యికి పైగా పింఛన్లు మంజూరు చేయడం ద్వారా వారి ఆనందాన్ని కళ్లారా చూశాను. అలాగే ఇళ్లు అవసరం ఉన్న వారిని గుర్తించాం. త్వరలోనే వారికి ఇళ్లు మంజూరు చేస్తాం. ఇలా నియోజకవర్గంలో ఇప్పటి వరకు 102 పంచాయతీలకు సంబంధించి 47 సచివాలయాల పరిధిలో 36,500 పైగా కుటుంబాలను కలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ముఖ్యమంత్రి అడుగు జాడల్లో దిగ్విజయంగా గడపగడపకు మన ప్రభుత్వాన్ని పూర్తి చేసి, ప్రజలకు చేరువగా ఉంటాను.

తూర్పాటి పయనమెటు..?

వైసిపికి బైబై చెప్పనున్న సీనియర్ నేత!


తూర్పాటి వెంకటరామకృష్ణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం పంచాయతీ సర్పంచ్ తూర్పాటి సంతోషమ్మ భర్త, వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ అధికార పార్టీని వీడనున్నారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. పంచాయతీలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలే అందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

గొల్జాం పంచాయతీ పేరు వినగానే ముందుగా గుర్తుకొచ్చేది తూర్పాటి కుటుంబీకులే. గత పంచాయతీ ఎన్నికలలో వైసిపి నుంచి వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ సతీమణి సంతోషమ్మ.. టిడిపి అభ్యర్థి తూర్పాటి రాములమ్మపై 137 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి కృష్ణస్వామినాయుడు కుటుంబీకులను ఓడించిన రాములమ్మపై సంతోషమ్మ విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. అయితే ఇటీవల కాలంలో ఏమైందో ఏమో గానీ విభేదాలు తలెత్తాయి. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న యువతను కొందరు సీనియర్ నాయకులు పైకి రానివ్వకుండా అడ్డుపడుతున్నారని సమాచారం. సర్పంచ్‌తో సంప్రదింపులు లేకుండా కొందరు సీనియర్ నాయకులు సొంత నిర్ణయాలతో తీసుకుంటున్నట్లు తెలిసింది.

పార్టీ కన్వీనర్ల నియామకంతోపాటు గతంలో ఉపాధి హామీ మేట్లు ఎంపిక, వాలంటీర్ పోస్ట్ నియామకం విషయంలో సర్పంచ్‌ను సంప్రదించకపోవడంతో వెంకటరామకృష్ణ ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. పార్టీ నాయకుల ఏకపక్ష నిర్ణయాన్ని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వద్దకు తీసుకెళ్లినట్లు బోగట్టా. అయినా ప్రయోజనం లేకపోవడంతో వైసిపిని వీడనున్నట్లు తెలిసింది. గొల్జాం పంచాయతీనే కాదు, ఎల్.కోట, వేపాడ మండలాల్లో పలు పంచాయతీల్లో గెలుపోటములను ప్రభావితం చేయగలిగే నాయకులు వెంకటరామకృష్ణ. ఆయన ద్వారా పై రెండు మండలాల్లో సుమారు 300 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. అలాంటి నాయకుడు పార్టీకి దూరమైతే వైసిపికి ఎదురుదెబ్బ తప్పదన్నది రాజకీయ విశ్లేషకుల వాదన.

గ్రామసభ బహిష్కరణ

ప్రజాశక్తి-వేపాడ


గ్రామసభను బహిష్కరించడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మండలంలోని పాటూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభను సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ కె.రమణమూర్తి, ఎంపిటిసి సభ్యులు ద్వారపూడి మంగమ్మ, పాలకవర్గ సభ్యులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో ఎన్నుకోబడిన తమకు సమాచారం ఇవ్వకుండా పాటూరు సచివాలయ సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి, ఎంపిడిఒ సమీక్ష నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండల, జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించేటప్పుడు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా కార్యక్రమాలు, పథకాలు పంపిణీ నిర్వహించ కూడదని బహిరంగ సభలో మాత్రం చెబుతున్నారని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో మాత్రం ఏ పదవీ లేని అధికార పార్టీ నాయకులు సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా చేయడానికి ప్రత్యేకంగా ఏమైనా జిఒ ఉంటే తమకూ అందజేయాలన్నారు. సచివాలయ సిబ్బందిని కూడా భయపెట్టి పనులు చేపట్టకుండా అడ్డుతగులుతున్నారని చెప్పారు. గ్రామంలో వివాదాలకు ఎంపిడిఒనే ప్రధానకారణమని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే గ్రామసభను బహిష్కరించామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-డెంకాడ


మాట్లాడుతున్న ఎస్ఇబి ఎస్ఐ కరుణలత

మాదక ద్రవ్యాలతో విద్యార్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నట్లు తేలితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని ఎస్ఇబి రూరల్ ఎస్ఐ విఎల్ కరుణలత తెలిపారు. ఎంవిజిఆర్ కళాశాలలో శుక్రవారం ఎంబిఎ విద్యార్థులు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్, డ్రగ్స్ ఫ్రీ సొసైటీపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న డ్రగ్స్ దందాను కొన్ని ఉదాహరణలతో ప్రస్తావించారు. ప్రస్తుత తరంలోని యువకుల కెరీర్‌ను నాశనం చేసే డ్రగ్స్ వినియోగం లేదా రవాణాలో మునిగిపోవద్దని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్ వల్ల ప్రతికూల ప్రభావాలపై పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ పి.రామచంద్రకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎల్.రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు బి.హరికుమార్, డి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి అసత్య ప్రచారాలు



గజపతినగరం.. సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

పింఛను పథకంపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పింఛను వారోత్సవ సభలో వివిధ రకాల కొత్త, పాత పింఛన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పెరుగుతున్న జనాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు పింఛన్లు పథకంలో కోతలు విధిస్తున్నారంటూ దుష్ప్రచారాలకు దిగుతున్నారని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడం చంద్రబాబు నాయుడుకు ఇష్టం లేదన్నారు. నియోజకవర్గంలో రూ.987 కోట్లను పింఛన్లు రూపంలో అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. అందులో భాగంగానే విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. శాశ్వత భూ రక్ష పథకంలో భాగంగా గ్రామాలలో రెవెన్యూ అధికారులు జరిపిన సమగ్ర భూ సర్వేలో ఎటువంటి వివాదాలు లేని భూములకు సంబంధించి పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన.జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు, పిఎసిఎస్ చైర్మన్ కరణం ఆదినారాయణ, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ పప్పు సుదర్శన్, డిటి సత్యనారాయణ, వైసిపి నాయకులు బూడి వెంకటరావు, మండలి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి చొక్కాపు లక్ష్మణ రావు అధ్యక్షతన నిర్వహించిన నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95శాతం నెరవేర్చారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి పెంకి అరుణ, బెల్లాన ప్రసాద్, తహశీల్దార్ గణపతిరావు, ఎంపిడిఒ రమామణి, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని ఎం.కొత్తవలసలో కొత్త పింఛన్లను సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు పంపిణీ చేశారు.



రామభద్రపురం.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి; బొండపల్లి.. ఎం.కొత్తవలసలో పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు


రేగిడి.. పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రేగిడి : పేదలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పష్టంచేశారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన 241 పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైసిపి నాయకులు నెల్లి పెంటన్నాయుడు, కెంబూరు వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ గన్నవరపు కాశీవిశ్వనాథ రావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, పి.బాబూరావు, రామినాయుడు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలే కీలకం


పూసపాటిరేగ.. మాట్లాడుతున్న కార్యదర్శి ఉమాశంకరి

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్లలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఉమాశంకరి అధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలోని సమస్యలను తెలియజేయాలని ప్రజలను కోరారు. తాగునీటి పైపులైన్లకు రంధ్రం చేసి మోటార్ల ద్వారా ట్యాంకులకు ఎక్కించుకుంటున్నారంటూ కొంతమంది తెలిపారు. దాంతో వీధి కుళాయిలకు రావాల్సిన నీరు రావడం లేదని తెలిపారు. వెంటనే ఎఎంసి చైర్మన్ ప్రతినిధి పుప్పాల లక్ష్మీనారాయణ స్పందించి ఇటువంటి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులకు తెలిపారు. ఇళ్ల బిల్లు విషయమై ఇప్పటికే ఎమ్మెల్యేతో ఉన్నతాధికారులకు తెలియజేశామని, త్వరలో బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. రోడ్లు, కాలువలు అవసరమైన చోట నిర్మించుకునేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, విఆర్ఒ టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో సింగరాయి, డిఆర్‌పేట, కరకవలస, పికెఆర్ పురం, ఓబలయ్యపాలెం, కొంపల్లి, వావిలపాడు, బల్లంకి, బానాది, ఎంకెఆర్ పురం గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రణాళికలను రూపొందించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ.. మాట్లాడుతున్న సింగరాయి సర్పంచ్ ఎన్.వెంకట్రావు

సెంచూరియన్‌లో ప్రయోగశాలలు భేష్


జెఎన్‌టియు వైస్ చాన్సలర్ జివిఆర్ ప్రసాదరాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల


ఎఆర్ విఆర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విసి జివిఆర్ ప్రసాదరాజు

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ప్రయోగశాలలు బాగున్నాయని జెఎన్‌టియు వైస్ చాన్సలర్ డాక్టర్ జివిఆర్ ప్రసాదరాజు కితాబిచ్చారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎఆర్ విఆర్ ప్రయోగశాలను సందర్శించారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన ఎఆర్‌విఆర్, 3డి ప్రింటర్లు, ఇన్‌స్టా యాప్ అభివృద్ధి చేయడం పట్ల అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, ఎంవిజిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్ నుంచి అవార్డులు అందుకొంటున్న వేపాడ, రేగిడి ఎంపిడిఒలు బిఎస్‌కెఎన్ పట్నాయక్, జికె విశ్వనాథరావు, ఎంఇఒ వరప్రసాదరావు


అధికారులకు పురస్కారాలు

జిల్లాలో చిట్టి గురువులు కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అధికారులకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్యకుమారి అవార్డులను అందజేశారు. వేపాడ, బాడంగి, రేగిడి ఎంపిడిఒలు బిఎస్‌కెఎన్ పట్నాయక్, అక్కారావు, జి.కాశీవిశ్వనాథరావు, రేగిడి ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, పలువురు ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు కలెక్టర్ అవార్డులు అందజేశారు.


అవార్డులతో బాడంగి ఎంపిడిఒ అక్కారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

– ప్రజాశక్తి, వేపాడ, రేగిడి, బాడంగి

జయప్రకాశ్‌కు ఘన నివాళి


జయప్రకాశ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్ష్మునాయుడు, బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి

కీర్తిశేషులు, మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్‌కు 15వ వర్ధంతిని బాడంగిలోని టిడిపి కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ విగ్రహానికి ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెర్లాం నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన జయప్రకాశ్.. తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిలబడ్డారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో కార్యకర్తలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు రవి, పాలవలస గౌరు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని అరసబలగ గ్రామంలో శుక్రవారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గోపాలవలసకు చెందిన ట్రాక్టర్‌కు అరసబలగలో వరిగడ్డి ఎక్కించుకుని తీసుకెళున్నారు. గ్రామ సమీపంలో విద్యుత్తు వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే ట్రక్ నుండి ఇంజిన్‌ను వేరుచేయడంతో ప్రమాదం తప్పింది. రాజాం ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు

గ్రామ సమీపంలో విద్యుత్తు తీగలు రోడ్డుపై కిందగా వేలాడుతున్నాయని విద్యుత్తు శాఖ ఎఇకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని సర్పంచ్ సాయిరాం తెలిపారు. జనరల్ బాడీ సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. దాని ఫలితమే ఈ ప్రమాదమని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆకతాయిల వీరంగం

ప్రజాశక్తి-బొబ్బిలి

కోటి చెరువు గట్టుపై ఆకతాయిలు వీరంగం చేస్తున్నారు. కోటిచెరువు గట్టుపై వాకర్స్, విశ్రాంతి తీసుకునే వారు కూర్చునేందుకు రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ఆకతాయిలు పగులగొట్టారు. కొన్ని బెంచీలను పగలగొట్టగా మరికొన్ని బెంచీలను తుప్పలోకి తీసేసారు. బెంచీలను పగలగొట్టిన ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని రోటరీ క్లబ్ కార్యదర్శి వారణాసి శ్రీహరి కోరారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

ఓ వ్యక్తిని బెదిరించి అతని వద్ద ఉన్న నగదును కాజేసిన ఇద్దరు నిందితులను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ టివి తిరుపతిరావు వివరించారు. ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్వారపూడి పంచాయతీ విజయకుమార్ లేఅవుట్ వద్ద డోల పాపుడు ఇంటి వద్ద స్కూటీ పెట్టి, పక్కకు వెళ్లి ఫోన్‌లో మాట్లాడుతుండగా ఇద్దరు వ్యక్తులు ఒక మోటార్ సైకిల్ పై వచ్చి, అతన్ని కత్తితో బెదిరించి, స్కూటీ డిక్కీలో పెట్టుకున్న రూ.1.10 లక్షల నగదు, స్కూటీ డిక్కీలో ఉన్న ల్యాండ్ డాక్యుమెంట్లు, చెక్ బుక్, గోల్డ్ లోన్ డాక్యుమెంట్‌లు ఎత్తికెళ్లిపోయారు. ఆయన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం వసంత విహార్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు మానుపాటి దుర్గాప్రసాద్, కర్రెద్దుల మహేష్ పట్టుకొని, వారి నుంచి 5 సెల్ ఫోన్లు (గతంలో వేరువేరు చోట్ల దొంగతనం చేసినవి), బైక్, నేరాలు చేసేందుకు ఉపయోగించిన ఇనుప సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గుంటూరు జిల్లా బాపట్ల మండలం స్టువర్టుపురానికి చెందిన వారుగా గుర్తించారు. కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ సిఐ టివి తిరుపతిరావు, రూరల్ ఎస్ఐ బి.గణేష్, ఎఎస్ఐ ఆల్తి త్రినాధ రావు, కానిస్టేబుల్ షేక్ షఫీలను ఎస్పి అభినందించారు.